వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 075
పేజీలు : 06 | వెల: రూ.5/-
గురువారం
మార్చి 05, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## సాగులో 'స్మార్ట్' పద్ధతులు అవసరం

- జిల్లా కలెక్టర్ డా.సత్య శారద
- మామునూరు కేవీకేలో ఘనంగా 'కిసాన్ మేళా'
- అధిక సాంద్రత పత్తి సాగుపై అవగాహన

2లో..




# విద్యుత్ సేవలలో.. సరికొత్త విప్లవం

NPD
TSNPDCL

- వినియోగదారుల చెంతకు ఎన్పీడీసీఎల్
- 7,840 'పొలం బాట'లతో అన్నదాతల సమస్యలకు మోక్షం
- అంతరాయం కలిగితే నిమిషాల్లో ఈఆర్టీ వాహనాలు
- జియో ట్యాగింగ్, జీఐఎస్ మ్యాప్పింగ్‌తో విద్యుత్ నెట్‌వర్క్‌పై పక్కా నిఘా
- నిర్ణీత గడువులోగా సేవలు
- సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీ ఎన్పీడీసీఎల్) వినియోగదారుల సేవలో సరికొత్త సాంకేతిక విప్లవానికి తెరలేపింది. సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి సారథ్యంలో క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'పొలం బాట', 'ప్రజా బాట' వంటి వినూత్న కార్యక్రమాలతో అధికారులు నేరుగా ప్రజల వద్దకు వెళ్తున్నారు. దాదాపు 7,840 పోలం బాటల ద్వారా వేలాది వంగిన స్తంభాలను, లూజ్ లైన్లను సరిచేస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. విద్యుత్ అంతరాయాలను నిమిషాల్లో గుర్తించేందుకు జియో ట్యాగింగ్, GIS మ్యాపింగ్ మరియు ఫాల్ట్ పాసేజ్ ఇండికేటర్ల (FPI) వంటి అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు GPRS సౌకర్యం ఉన్న 54 ERT వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. వినియోగదారులు ఇంటి నుంచే బిల్లులు చెల్లించేలా 19 ఫీచర్లతో మొబైల్ యాప్‌ను, వాట్సాప్ చాట్‌బాట్ సేవలను సంస్థ ప్రవేశపెట్టింది. పారదర్శకత కోసం రైతులకు అంచనా వివరాలను తెలుగులోనే అందిస్తూ, 'జీరో ప్రమాదాల' లక్ష్యంతో సేఫ్టీ ఆఫీసర్లను కూడా నియమించారు. మొత్తానికి, సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా సేవలు అందిస్తూ ఎన్పీడీసీఎల్ ప్రజా బాటలో దూసుకుపోతోంది.

- వరంగల్ వాయిస్, హనుమకొండ

వివరాలు 2లో..

**కార్యక్రమం / సేవ - గణాంకాలు / విశేషాలు**

**పొలం బాట కార్యక్రమాలు:**
7,840 (రైతుల సమస్యల పరిష్కారం కోసం)

**సాంకేతిక పర్యవేక్షణ :**
జియో ట్యాగింగ్ & 16,000+ FPI ఇండికేటర్లు

**అత్యవసర బృందాలు :**
54 ERT వాహనాలు (GPRS సదుపాయంతో)

**డిజిటల్ సేవలు :**
మొబైల్ యాప్ & వాట్సాప్ చాట్‌బాట్ (7901628348)

**ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్:** 1912



## రాజ్యసభ అభ్యర్థిగా వేం నరేందర్ రెడ్డి నామినేషన్

- వెంట నిలిచిన సీఎం రేవంత్ రెడ్డి
- తరలివచ్చిన పీసీసీ చీఫ్, నాయకులు

తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన ముఖ్యమంత్రి రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డి గురువారం తన నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. అసెంబ్లీలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యక్షంగా పాల్గొని ఆయనకు మద్దతు తెలిపారు. పార్టీ అధిష్టానం నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు వేం నరేందర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో నామినేషన్ పత్రాలను అందజేశారు. నరేందర్ రెడ్డి ఎంపిక పట్ల ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆయన నామినేషన్ వేసిన సమయంలో రాష్ట్ర మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

*– వరంగల్ వాయిస్, హైదరాబాద్*



3లో..

## నాణ్యతలో రాజీ పడొద్దు

- పనులను వేగవంతం చేయాలి
- అధికారులకు కలెక్టర్ దివాకర ఆదేశం
- ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం
- క్షేత్రస్థాయిలో నిర్మాణ పనుల పరిశీలన



6లో..

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకుంటే చర్యలు

- కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- బల్దియా పరిధిలో శానిటేషన్, అభివృద్ధి పనుల తనిఖీ
- బిల్లుల చెల్లింపునకు ప్రత్యక్షంగా కొలతల పరిశీలన
- నిర్దేశిత ప్రణాళిక ప్రకారం డ్రైన్ల క్లీనింగ్ జరగాలి

# విద్యుత్ సేవలలో సరికొత్త విప్లవం

- వినియోగదారుల చెంతకు ఎన్పీడీసీఎల్
- 7,840 'పోలం బాట'లతో అన్నదాతల సమస్యలకు మోక్షం
- అంతరాయం కలిగితే నిమిషాల్లో ఈఆర్టీ వాహనాలు
- జియో ట్యాగింగ్, జీఐఎస్ మ్యాప్పింగ్‌తో విద్యుత్ నెట్‌వర్క్‌పై పక్కా నిఘా
- నిర్ణీత గడువులోగా సేవలు..
- సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ధీమా



**హనుమకొండ, మార్చి 5 (వరంగల్ వాయిస్):** ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) సరికొత్త పుంతలు తొక్కుతోంది. కేవలం విద్యుత్ సరఫరా చేయడమే కాకుండా, వినియోగదారులకు అత్యంత పారదర్శకమైన, వేగవంతమైన సేవలను అందించడమే లక్ష్యంగా సాంకేతిక విప్లవాన్ని ఆవిష్కరిస్తోంది. సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి సారథ్యంలో రైతుల కోసం 'పోలం బాట', సామాన్యుల కోసం 'ప్రజా బాట' వంటి వినూత్న కార్యక్రమాలతో సంస్థ నేడు ప్రజలకు మరింత చేరువయ్యింది. రైతుల విద్యుత్ కష్టాలను తీర్చేందుకు చేపట్టిన "విద్యుత్ అధికారుల పోలం బాట" అద్భుత ఫలితాలను ఇస్తోంది. ఇప్పటివరకు 7,840 పోలం బాటలు, 938 ప్రజా బాట కార్యక్రమాల ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించారు. ఈ క్రమంలో 4,540 వంగిన పోల్స్, 22,224 లూజ్ లైన్లను సరిచేయడమే కాకుండా, విద్యుత్ లోడ్ తగ్గించేందుకు 19,245 మధ్య స్తంభాలను ఏర్పాటు చేయడం విశేషం.

### సాంకేతికతతో 'షాక్' లేని సేవలు

విద్యుత్ అంతరాయాలను నిమిషాల్లో గుర్తించేందుకు సంస్థ అత్యాధునిక సాంకేతికతను వాడుతోంది. 25 కి.మీ కంటే ఎక్కువ పొడవున్న లైన్లలో సమస్యలను గుర్తించేందుకు 16,000కు పైగా 'ఫాల్ట్ పాసేజ్ ఇండికేటర్లను' (ఎఫ్ పీఐ) అమర్చారు. ప్రతి విద్యుత్ స్తంభానికి 'యూనిక్ పోల్ నెంబర్' కేటాయించి జియో ట్యాగింగ్ చేయడం ద్వారా సమస్య ఎక్కడ ఉందో కార్యాలయం నుంచే ట్రాక్ చేసే వెసులుబాటు కల్పించారు. ప్రకృతి వైపరీత్యాలు లేదా ప్రమాదాలు జరిగినప్పుడు యుద్ధ ప్రాతిపదికన స్పందించేందుకు 54 ఎమర్జెన్సీ రీస్టోర్ టీమ్ (ERT) వాహనాలను GPRS సౌకర్యంతో అందుబాటులో ఉంచారు.

### చేతిలోనే బిల్లుల చెల్లింపు..

వినియోగదారుల సౌకర్యార్థం 19 ఫీచర్లతో టీజీఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్‌ను రూపొందించారు. దీని ద్వారా కేవలం రెండు నిమిషాల్లో సురక్షితంగా బిల్లులు చెల్లించవచ్చు. అలాగే 7901628348 నంబర్‌తో 'వాట్సాప్ చాట్ బాట్' సేవలను ప్రవేశపెట్టారు. కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రతి దశలోనూ ఎస్ఎంఎస్ (SMS) ద్వారా సమాచారం అందుతుంది. ముఖ్యంగా రైతులకు అర్థమయ్యేలా ఎస్టిమేట్ వివరాలను, స్కెచ్‌లను తెలుగులో అందిస్తూ పారదర్శకతను పెంచారు.

### 'విద్యుత్ ప్రజావాణి'..

"జీరో విద్యుత్ ప్రమాదాలు" లక్ష్యంగా ప్రత్యేక సేఫ్టీ ఆఫీసర్లను నియమించినట్లు సీఎండీ తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే 'విద్యుత్ ప్రజావాణి'ని ఉపయోగించుకోవాలని కోరారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫిర్యాదు చేయాలని, రైతులు సొంతంగా విద్యుత్ పనులు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.



# బాధితులకు భరోసానివ్వాలి

- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్
- పారదర్శక సేవలతోనే ప్రజల అభిమానం
- ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికి త్వరితగతిన న్యాయం జరుగుతుందనే గట్టి నమ్మకాన్ని కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం ఆయన ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీకి ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రావు పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. స్టేషన్‌కు చేరుకున్న వెంటనే సీపీ రికార్డులను, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్‌తో సమీక్ష నిర్వహిస్తూ కింది అంశాలపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలు, అక్కడ ప్రజల జీవనశైలి, ప్రధానంగా జరుగుతున్న నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్లు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, బీట్లు మరియు పెట్రోలింగ్‌ను పటిష్టం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, నిందితుల అరెస్టులు మరియు రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, దర్యాప్తులో వేగం పెంచాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి సీపీ మాట్లాడుతూ కీలక సూచనలు చేశారు. "ఫిర్యాదు అందిన వెంటనే స్పందించడం పోలీసుల ప్రాథమిక బాధ్యత. విధి నిర్వహణలో అలసత్వానికి తావుండకూడదు. పారదర్శకంగా వ్యవహరిస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలి. బాధితులతో మర్యాదగా ప్రవర్తించి, వారికి అండగా ఉండాలన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సీపీ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఉద్యమకారుల ఫోరం కోఆర్డినేటర్‌గా నాగరాజు

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్‌గా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన ముదురకోల్ల నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు జిల్లా చైర్మన్ నందగిరి రజినీకాంత్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. నాగరాజు నియామకం సందర్భంగా రజినీకాంత్ మాట్లాడుతూ, ఉద్యమకారుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి నాగరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారులందరినీ ఏకం చేస్తూ, వారి సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# రక్త క్యాన్సర్‌పై అపోహలు వద్దు

- ప్రముఖ హీమటాలజిస్ట్ డాక్టర్ కరుణ కుమార్
- ప్రాథమిక దశలో గుర్తిస్తే సంపూర్ణ ఆరోగ్యం
- బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్‌తో ప్రాణాపాయం నుంచి విముక్తి
- హనుమకొండలో అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రక్త క్యాన్సర్ (బ్లడ్ క్యాన్సర్) పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు తొలగి, సరైన సమయంలో చికిత్స తీసుకుంటే రోగులు పూర్తిస్థాయిలో కోలుకునే అవకాశం ఉందని ప్రముఖ హీమటాలజిస్ట్, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులు డాక్టర్ కరుణ కుమార్ స్పష్టం చేశారు. గురువారం హనుమకొండలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రక్త క్యాన్సర్ లక్షణాలు ప్రారంభంలో చాలా సాధారణ అనారోగ్యంలాగే కనిపిస్తాయని, వాటిని గుర్తించడంలోనే చికిత్స విజయం దాగి ఉందని డాక్టర్ వివరించారు. ఈ కింది లక్షణాలు ఉంటే వెంటనే అలర్ట్ అవ్వాలని సూచించారు.

తరచుగా జ్వరం రావడం, విపరీతమైన బలహీనత ఆవహించడం, శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గి తరచుగా ఇన్ఫెక్షన్ల బారిన పడటం, ఆకస్మికంగా బరువు తగ్గడం, మెడ లేదా చంకల భాగంలో గడ్డలు (లింఫ్ నోడ్స్) రావడం, గాయాలు కాకుండానే చర్మంపై నీలి మచ్చలు ఏర్పడటం లేదా తరచుగా రక్తస్రావం కావడం జరుగుతుందని వివరించారు. "రక్త క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స ఫలితాలు అత్యంత మెరుగ్గా ఉంటాయి. అపోహలను నమ్మి కాలయాపన చేయకుండా, అనుమానం ఉన్నప్పుడు వెంటనే హీమటాలజిస్ట్‌ను సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలి" అని డాక్టర్ కరుణ కుమార్ హితవు పలికారు. ఆధునిక వైద్య విధానంలో బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ ద్వారా క్లిష్టమైన కేసులను కూడా విజయవంతంగా నయం చేయవచ్చని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కాల్వ నరేష్, అసిస్టెంట్ మేనేజర్లు రాజకుమార్, స్వరాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సాగులో 'స్మార్ట్' పద్ధతులు అవసరం

- జిల్లా కలెక్టర్ డా.సత్య శారద
- మామునూరు కేవీకేలో ఘనంగా 'కిసాన్ మేళా'
- అధిక సాంద్రత పత్తి సాగుపై అవగాహన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని, అప్పుడే సాగు లాభసాటిగా మారుతుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. గురువారం మామునూరులోని పి.వి. నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయ కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన 'కిసాన్ మేళా'కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ స్టాళ్లను కలెక్టర్ ప్రారంభించి పరిశీలించారు. రైతులతో ముచ్చటించి ఆధునిక యంత్రాల వినియోగం, పంట రక్షణ చర్యలపై ఆరా తీశారు. అనంతరం కేవీకే ద్వారా గత రెండేళ్లుగా నిర్వహించిన కార్యకలాపాలపై రూపొందించిన ప్రత్యేక సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సూచించే నూతన పద్ధతులను పాటించి రైతులు దిగుబడిని పెంచుకోవాలి. నేల సారాన్ని కాపాడేందుకు పంట మార్పిడి పద్ధతులను అనుసరించాలని కోరారు. కృషి విజ్ఞాన కేంద్రం అందించే శిక్షణలను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ కిషన్ కుమార్ మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తి సాగు వల్ల గులాబీ రంగు పురుగు తాకిడిని తగ్గించవచ్చని, కూలీల ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుందని వివరించారు. వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు రైతులకు ఉన్న పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ బాలకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ అనురాధ, హనుమకొండ ఏడీఏ రవీందర్ సింగ్, ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, ఆత్మా పీడీ విజయ నిర్మల పాల్గొన్నారు. కేవీకే హెడ్ డాక్టర్ అరుణ జ్యోతి పర్యవేక్షణలో జరిగిన ఈ మేళాకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు.

# వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**□ ములుగు కలెక్టర్ దివాకర టీఎస్**



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. వైద్యులను, సిబ్బందిని హెచ్చరించారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అత్యవసర విభాగం, వృద్ధాప్య వార్డు, పెడియాట్రిక్ వార్డు, ల్యాబొరేటరీలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై కలెక్టర్ నేరుగా రోగులతో మాట్లాడారు. వైద్య సిబ్బంది సకాలంలో స్పందిస్తున్నారా? పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా? అని ఇన్ పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న మొత్తం విభాగాలు, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది సంఖ్య, రోజువారీ ఇన్ పేషెంట్ల నమోదుపై అధికారులతో సమీక్షించారు. మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తూ.. గడువు ముగిసిన మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని, రోగులకు మందులు ఇచ్చే ముందు రెండుసార్లు చెక్ చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఆసుపత్రిలోనే ఉచితంగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా పనిచేయాలని, ప్రసవాల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రోగికి తప్పనిసరిగా 'హెల్త్ ప్రొఫైల్' చెక్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న అదనపు గదుల పనులను కూడా ఆయన పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, వివిధ విభాగాల వైద్యులు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యతలో రాజీ పడొద్దు

- పనులను వేగవంతం చేయాలి
- అధికారులకు కలెక్టర్ దివాకర ఆదేశం
- ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం
- క్షేత్రస్థాయిలో నిర్మాణ పనుల పరిశీలన



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లాలో ప్రతిష్టాత్మకగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఇంచర్ల శివారులోని ఎర్రి గట్టమ్మ ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే.. ఫినిషింగ్ పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణంలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాలి. ఎక్కడా అలసత్వానికి తావుండకూడదు. ఎలక్ట్రిసిటీ, ఫ్లోరింగ్, పెయింటింగ్ వంటి కీలక పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. నిర్మాణ పనుల్లో ఏవైనా ఆటంకాలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, గడువులోగా నిర్మాణం పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అజయ్ కుమార్, డివిజనల్ ఇంజనీర్ లింగారెడ్డి, కాంట్రాక్టర్ కృష్ణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల రక్షణ కవచం 'హెచ్ పీవీ' టీకా

**□ కలెక్టర్ దివాకర టీఎస్**



**వరంగల్ వాయిస్, ములుగు :** గర్భాశయ క్యాన్సర్ మహమ్మారి నుంచి ఆడబిడ్డలను కాపాడేందుకు 'హ్యూమన్ పాపిలోమా వైరస్' టీకా ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఈ టీకా కార్యక్రమ నిర్వహణపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే అరికట్టేందుకు ప్రభుత్వం ఈ వ్యాక్సినేషన్ చేపట్టిందన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో ఈ నెల 8 నుంచి ఈ టీకా పంపిణీ ప్రారంభమవుతుందని వెల్లడించారు. బాలికల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు టీకాకు సంబంధించిన సాంకేతిక వివరాలను వెల్లడించారు. 14 సంవత్సరాల లోపు బాలికలు, అంటే 01-02-2011 నుండి 28-02-2012 మధ్య జన్మించిన వారు ఈ టీకాకు అర్హులు, వ్యాక్సినేషన్ కేంద్రానికి వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికేట్ లేదా స్కూల్ అపార్ ఐడీ కార్డులలో ఏదైనా ఒకటి తీసుకురావాలి. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పి. చంద్రశేఖర్, ఏటూరునాగారం ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సురేష్ కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీకాంత్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగ అనేష్ తదితరులు పాల్గొన్నారు.



## బెల్ట్ షాపులపై ఉక్కుపాదం

- గోరుగుట్ట – జగ్గుతండాలో మద్యంపై నిషిద్ధం
- సర్పంచ్ విజయలక్ష్మి భాస్కర్ నాయక్

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** గ్రామ యువత భవిష్యత్తు, మహిళల భద్రతే ధ్యేయంగా పర్వతగిరి మండలంలోని గోరుగుట్ట – జగ్గుతండా గ్రామ పంచాయతీ సంచలన నిర్ణయం తీసుకుంది. తండా పరిధిలో అక్రమ మద్యం విక్రయాలను (బెల్ట్ షాపులను) పూర్తిగా నిషేధిస్తూ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేసింది. గ్రామ అభివృద్ధిని కాంక్షిస్తూ సర్పంచ్ విజయలక్ష్మి భాస్కర్ నాయక్ నేతృత్వంలో తీసుకున్న ఈ నిర్ణయానికి సంబంధించి కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయిస్తే రూ.50,000 నుంచి రూ.1,00,000 వరకు జరిమానా విధిస్తారు. మద్యం అమ్మకాలు కొనసాగిస్తే సంబంధిత ఇంటి నెంబర్‌ను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. రోడ్ల పక్కన మద్యం సేవించడం, ఖాళీ సీసాలను పడేయడంపై పూర్తి నిషేధం విధించారు. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయించే వారిపై సమాచారం అందించిన వారికి పంచాయతీ తరపున ప్రత్యేక నగదు బహుమతి అందజేయనున్నట్లు ప్రకటించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.



## బాధిత కుటుంబానికి పరామర్శ

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డుకు చెందిన యాట నాగరాణి (ముదిరాజ్) అనారోగ్యంతో అకాల మరణం చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.మృతురాలు నాగరాణికి ఇద్దరు చిన్నపిల్లలు ఉండగా, కుటుంబ ఆర్థిక స్థితిగతులు అత్యంత దయనీయంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కౌన్సిలర్ పూర్ణ చారి స్వయంగా స్పందించి బాధిత కుటుంబానికి నిత్యావసరాలకు ఇబ్బంది కలగకుండా 25 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను స్వయంగా అందజేశారు. తల్లిని కోల్పోయి అనాథలైన చిన్నపిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, దాతలు పెద్ద మనసుతో ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో చందుపట్ల రాజిరెడ్డి, దార్నా నారాయణదాసు, నరేష్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గిరిజన నిరుద్యోగులకు ఉపాధి భరోసా



**□ జాబ్ మేళాలో 285 మందికి ఉద్యోగాలు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గిరిజన నిరుద్యోగ యువతకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ అధికారి ఆదేశానుసారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. గురువారం హనుమకొండలోని గిరిజన భవన్‌లో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన ఈ మేళాలో ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చారు.

ఈ జాబ్ మేళాకు మొత్తం 566 మంది అభ్యర్థులు హాజరుకాగా, వివిధ రంగాలకు చెందిన 27 ప్రైవేట్ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలలో 285 మంది ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ఐటీడీఏ ఎస్.ఓ సురేష్ బాబు, హనుమకొండ డీటీడీఓ ప్రేమ కళ చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.

క్వెస్ (క్వెస్-35 మంది), రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్ (26 మంది), క్యాపిటల్ వింగ్ (25 మంది), అనుదీప్ ఫౌండేషన్ (20 మంది), మీజమో మీడియా (20 మంది), మహీంద్రా (16 మంది) వంటి ప్రముఖ సంస్థలు అభ్యర్థులను ఎంపిక చేసుకున్నాయి. ఎంపికైన వారికి వారి విద్యార్హతలను బట్టి నెలకు రూ.15,000 నుండి రూ. 25,000 వరకు వేతనం ఉంటుందని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, గిరిజన యువతకు ప్రైవేట్ రంగంలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

ఎంపికైన యువత క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీటీడీఓ నారాయణ రెడ్డి, పీఈటీసీ ప్రిన్సిపాల్ సారయ్య దొర, ఏఓ పరశురాం, ఐటీడీఏ జేడీఎం కొండలరావు, స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ క్రీస్తు, జేఆర్పీలు మేకల పాపారావు, సరస్వతి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## పరీక్ష సామగ్రి పంపిణీ

**వరంగల్ వాయిస్, పరకాల :** విద్యార్థి జీవితంలో పదవ తరగతి పరీక్షలు అత్యంత కీలకమైనవని, ఈ దశలో కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను అన్నారు. పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు "మడికొండ బ్రదర్స్" ఆధ్వర్యంలో గురువారం స్థానిక "విద్యాలయ పాఠశాల" విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. తమ తల్లిదండ్రులు శ్రీ.శే.మడికొండ సారమ్మ – పోచయ్య జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టిన మడికొండ బ్రదర్స్‌ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోపి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## కార్యకర్తలకు అండగా ఉంటా

◆ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబాలే తమకు బలమైన ఆధారమని, ఏ కష్టమొచ్చినా వారికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంతో పాటు పెంచికలపేట గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన సముద్రాల సరోజన, పెరుమాండ్ల ఉప్పలయ్య, నాగెల్లి పాణి,పెంచికలపేట గ్రామానికి చెందిన కలకోట్ల సరోజన కుటుంబ సభ్యులను చల్లా ధర్మారెడ్డి స్వయంగా కలిసి ఓదార్చారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లేత ఆకుల సంజీవరెడ్డి, ఉప సర్పంచ్ భాషబోయిన పైడి, మాజీ ఫ్యాక్స్ డైరెక్టర్ నత్తి సుధాకర్, మాజీ వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు పార్టీ అధ్యక్షులు పాపని రవీందర్, సభ్యులు పార్శ రవి, మాజీ వార్డు సభ్యులు రేవూరి ప్రవీణ్ రెడ్డి, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు వినయ్



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పులుకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కీర్తి కిరీటంలో మరో మైలురాయి చేరింది. ఈ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పెంచాల వినయ్ అద్భుత క్రీడా ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. జనవరి 8న మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎస్జీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి 14 సంవత్సరాల బాలబాలికల సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వినయ్ తన అద్భుతమైన ఆట తీరుతో సెలక్టర్ల మనసు గెలుచుకొని రాష్ట్రస్థాయికి అర్హత సాధించాడు. ఈ నెల మార్చి 7 నుంచి 9 వరకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులోనే జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ఐ సాఫ్ట్ బాల్ పోటీల్లో వినయ్ పాల్గొననున్నాడు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వినయ్‌ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బానోతు జుమ్ము, గ్రామ సర్పంచ్ పెంచాల స్వరూప, ఉపసర్పంచ్ అంకేశ్వరపు జగతి లక్ష్మి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు పెంచాల రాజు ప్రత్యేకంగా అభినందించారు. వినయ్ మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.

# వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

◆ కలెక్టర్ స్నేహ శబరీష్
◆ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి



**వరంగల్ వాయిస్, బయ్యారం/దోర్నకల్ :** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేయాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. గురువారం బయ్యారం మండలం ఇస్లాపురం గిరిజన ఆశ్రమ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం మరియు ప్రాథమిక పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు, హాజరు పట్టిక, వంటశాల, డైనింగ్ హాల్ మరియు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రానున్న పదవ తరగతి పరీక్షలను పురస్కరించుకుని జిల్లాలోని 7,044 మంది విద్యార్థుల సన్నద్ధతపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి నాలుగు హాస్టళ్లకు ఒక ప్రత్యేక అధికారిని నియమించామని, ఏసీఎంఓలు, జీసీడీఓలు, స్పోర్ట్స్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ సిలబస్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉదయం బ్రేక్ ఫాస్ట్, స్నాక్స్ మరియు పౌష్టిక ఆహారాన్ని షెడ్యూల్ ప్రకారం అందించాలని, వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండేలా ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన సాగాలని కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు, వారికి అర్థమయ్యే రీతిలో ప్రాథమిక విద్యా బోధన చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం నాయక్, తహసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పీజీ పరీక్షలు ప్రారంభం

**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) మొదటి సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల కలిసి పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంపస్‌లోని మైక్రోబయాలజీ, జియాలజీ విభాగాలు, కామర్స్ కళాశాల, హ్యూమానిటీస్ భవనంతో పాటు సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను అధికారులు సందర్శించారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య రాజేందర్ కట్ల మాట్లాడుతూ.. మొదటి రోజు పరీక్షలకు సుమారు 98 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.మనోహర్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.నరసింహాచారి పాల్గొన్నారు. వీరితో పాటు విభాగాధిపతులు ఆచార్య ఆర్.మల్లికార్జున రెడ్డి, డాక్టర్ ఈ.సుజాత, డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, డాక్టర్ ఎం.లింగయ్య, డాక్టర్ చిలువేరు రాజ్ కుమార్, డాక్టర్ సంకేనేని వెంకట్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






## రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

**వరంగల్ వాయిస్, దేశాయిపేట్ :** నేటి యువత ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని, క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ వల్ల అనేక ప్రాణాలను కాపాడవచ్చని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజాత అన్నారు. గురువారం నగరంలోని సీకేఎం కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుజాత మాట్లాడుతూ.. నిబంధనలు అతిక్రమించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ లేకపోవడం వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. అధిక వేగంతో వాహనం నడపడం, రాంగ్ రూట్‌లో వెళ్లడం వంటి చర్యలు తోటి ప్రయాణికులకు కూడా శాపంగా మారుతాయని హెచ్చరించారు. తోటి విద్యార్థుల పట్ల గౌరవంగా ఉండాలని, కళాశాలలో క్రమశిక్షణను పాటించి మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది విద్యార్థులు పాల్గొని, రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. బాధ్యతాయుత ప్రవర్తన ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలని ఈ సందర్భంగా నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## వేం నరేందర్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే నాగరాజు

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన ముఖ్యమంత్రి రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ భేటీలో, రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం దక్కించుకున్న నరేందర్ రెడ్డికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాబోయే కాలంలో వారు పార్లమెంటులో తెలంగాణ గళాన్ని బలంగా వినిపించాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకులకు సముచిత స్థానం దక్కడం పట్ల ఎమ్మెల్యే ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

*– వరంగల్ వాయిస్, హైదరాబాద్/వర్ధన్నపేట*

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, మార్చి 05, 2026

# కాళేశ్వరంలో మంత్రి శ్రీధర్ బాబువివాహ వార్షికోత్సవ వేడుకలు

## ముక్తీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్/కాళేశ్వరం :** దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాళేశ్వర క్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం, శుభానంద పార్వతీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక కుంకుమార్చనలు జరిపారు. దేవస్థాన వేద పండితులు శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్ఛారణల మధ్య మంత్రి దంపతుల పేరిట సంకల్పం చేసి, ఆశీర్వచనాలు అందించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. మంత్రి శ్రీధర్ బాబు దంపతులు నిండు నూరేళ్లూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు లక్ష్మణ్, ఆలయ మాజీ డైరెక్టర్లు మెంగాని అశోక్, గందేసిరి సత్యనారాయణ, సుంకరి సీతయ్య, మాజీ సర్పంచ్ బందెల సత్యమ్మ, మండల ప్రధాన కార్యదర్శి మాదుగుల పవన్ శర్మ పాల్గొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ నాయకులు రేవెల్లి నాగరాజు, మాచెర్ల బ్రదర్స్, గందేసిరి మధుసూదన్, దూది వెంకటస్వామి, అరెవెల్లి సంపత్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మహిళా హక్కులే మానవ హక్కులు




**వరంగల్ వాయిస్, శివనగర్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది కేవలం వేడుక కాదు, అది మహిళల హక్కుల సాధన కోసం జరిగిన పోరాటాల గుర్తు అని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మంద సదాలక్ష్మి పేర్కొన్నారు. గురువారం వరంగల్ జిల్లా శివనగర్‌లోని మహిళా సమాఖ్య కార్యాలయంలో రహేలా అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత మంద సదాలక్ష్మి సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేదునూరి జ్యోతి మాట్లాడుతూ, సమాజం సాంకేతికంగా అభివృద్ధి చెందినప్పటికీ మహిళల పట్ల వివక్ష, అణచివేత, దాడులు నిత్యకృత్యం కావడం శోచనీయమన్నారు. మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, అసెంబ్లీ, పార్లమెంటుల్లో సమాన భాగస్వామ్యం కల్పించినప్పుడే అసలైన సాధికారత సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా మహిళలకు నెలకు రూ.4,000 జీవన భృతి, పెళ్లికి తులం బంగారం పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సనాతన ఆచారాల పేరుతో కేంద్ర పాలకులు మహిళా శక్తిని నిర్వీర్యం చేస్తున్నారని ఆమె విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాషామియా మాట్లాడుతూ.. మహిళా సాధికారత కేవలం మాటల్లో కాకుండా చేతల్లో ఉండాలన్నారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేద మహిళలకు తక్షణమే ఇళ్ల పట్టాలు ఇచ్చి, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లాదేళ్ల శరత్, భవాని, సౌందర్య, సువర్ణ, ఉమా, షహనాజ్ బేగం, విజయలక్ష్మి, షఫీనా, గౌతమి, మానస తదితరులు పాల్గొన్నారు. మార్చి 8న జరగబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై సమరశంఖం



## జిల్లా వ్యాప్తంగా 'మహాపంచాయత్‌లు'

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, పెండింగ్‌లో ఉన్న సాగు సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్ మోర్చా ఉమ్మడి పోరాటాలకు పిలుపునిచ్చింది. గురువారం నగరంలోని ఓంకార్ భవన్‌లో సుధమల భాస్కర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశానికి హాజరైన జిల్లా కన్వీనర్లు రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, కుసుంబ బాబూరావు, ఓదెల రాజయ్య, మైదం పాణి రాబోయే నిరసన కార్యక్రమాలను ప్రకటించారు. మార్చి 1 నుంచి 9 వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించి రైతుల్లో చైతన్యం నింపాలి. మార్చి 10 నుంచి ఏప్రిల్ 13 వరకు జిల్లా కేంద్రాలలో భారీ ఎత్తున 'మహాపంచాయత్‌లు' నిర్వహించనున్నారు. ఈ నెల 9న మచ్చాపూర్ సెంటర్‌లో జరిగే నిరసన కార్యక్రమానికి రైతులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం కోసం కింది డిమాండ్లు సాధించే వరకు పోరాటం ఆగదని నేతలు స్పష్టం చేశారు. ఎంఎస్పీ సి2+50 శాతం అమలుకు చట్టపరమైన హామీ కల్పించాలి. విద్యుత్ బిల్లు, విత్తన బిల్లు, నాలుగు కార్మిక కోడ్‌లు, వీబీజీ రామ్‌జీ చట్టాలను వెంటనే రద్దు చేయాలి. సమగ్ర రుణమాఫీ చేపట్టాలని, భూసేకరణ చట్టం–2013ను యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయవద్దని కేంద్రాన్ని హెచ్చరించారు. కేవలం రైతులే కాకుండా కార్మిక సంఘాలతో కలిసి ఐక్య పోరాటాలను తీవ్రతరం చేస్తామని నేతలు తెలిపారు. ఈ సభలు, సమావేశాల్లో రైతులు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని రైతు పోరాటానికి మద్దతు తెలపాలని కోరారు.

# ప్రతిష్టాత్మకంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'

## ☐ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**వరంగల్ వాయిస్, జనగామ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఇందులో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్, పట్టణ ప్రణాళిక, వార్డు అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని 99 రోజుల కార్యాచరణ ప్రణాళికతో ఐదు దశల్లో నిర్వహించాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు ఈ పనులు కొనసాగుతాయని వెల్లడించారు.తొలి విడతలో భాగంగా మున్సిపాలిటీల్లోని వార్డుల వారీగా కింది అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. పరిసరాల పరిశుభ్రత, తడి–పొడి చెత్త సేకరణ, ఫాగింగ్, పూడిక తీత, ఫ్రైడే–డ్రైడే నిర్వహణ, రోడ్ల మరమ్మతులు, అక్రమ హోర్డింగుల తొలగింపు, ఉద్యానవనాల శుభ్రత, పెండింగ్ దస్త్రాల క్లియరెన్స్, రికార్డుల నిర్వహణ, ఆహార భద్రతపై హోటళ్లలో తనిఖీలు, 5కే రన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో, చిత్తశుద్ధితో అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పనులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జనగామ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, స్టేషన్ ఘనపూర్ కమిషనర్ రాధాకృష్ణ, పట్టణ ప్రణాళిక అధికారులు, వార్డు అధికారులు పాల్గొన్నారు.



# ఉపాధి పనుల్లో ఎన్ఎంఎంఎస్ యాప్ నమోదు తప్పనిసరి

## ☐ డీఆర్‌డీఓ మేన శ్రీను

**వరంగల్ వాయిస్, దామెర :** ఉపాధి హామీ పథకంలో పారదర్శకత కోసం కూలీలు ప్రతిరోజూ రెండు ఫోటోలను ఎన్ఎంఎంఎస్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ జిల్లా దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడుతూ, వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో కూలీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు నీడ సౌకర్యంతో పాటు తాగునీరు అందుబాటులో ఉంచాలని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉపాధి హామీ పథకం ఒక వరం లాంటిదని, అర్హులైన కూలీలందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. కూలీల హాజరు శాతం, పనుల పురోగతిని ఆయన ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పిన్నింటి శారద, ఈసీ రాజేష్, టెక్నికల్ అసిస్టెంట్లు,ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# సరిత దునకాకు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మాస్యూటికల్ విభాగానికి చెందిన పరిశోధకురాలు సరిత దునకాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ఒక ప్రకటనలో తెలిపారు. "డెవలప్మెంట్ అండ్ ఇవాల్యుయేషన్ అఫ్ నానోకారియర్ బేస్డ్ ట్రాన్సడర్మల్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ అఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ " అనే అంశంపై ఆమె విభాగ ఆచార్యురాలు ఆచార్య జే.కృష్ణవేణి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. హనుమకొండకు చెందిన డాక్టర్ సరిత దునకాను విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకుంటే చర్యలు

- కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- బల్దియా పరిధిలో శానిటేషన్, అభివృద్ధి పనుల తనిఖీ
- బిల్లుల చెల్లింపునకు ప్రత్యక్షంగా కొలతల పరిశీలన
- నిర్దేశిత ప్రణాళిక ప్రకారం డ్రైన్ల క్లీనింగ్ జరగాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిలోనూ అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని హనుమకొండ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు. గురువారం ఆమె హనుమకొండ పరిధిలోని పలు డివిజన్లలో పర్యటించి, శానిటేషన్ పనులతో పాటు అభివృద్ధి పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు. పూర్తయిన వివిధ అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపు ప్రక్రియలో భాగంగా, పనుల నాణ్యతను మరియు కొలతలను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. 6వ డివిజన్ (బొక్కలగడ్డ), 4వ డివిజన్ (జ్యోతిరావు పూలే నగర్), 29వ డివిజన్ (రామన్నపేట)లలో రోడ్లు మరియు డ్రైన్ పనులను పరిశీలించారు. 30వ డివిజన్ పరిధిలోని జూ పార్క్ వద్ద కొనసాగుతున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను, పద్మాక్షి రోడ్డులో జరుగుతున్న ఆర్–1 రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా కొన్ని చోట్ల చెత్త కుప్పలు ఉండటాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. చెత్తను ఏ సమయాల్లో తొలగిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు.స్వచ్ఛ ఆటోలు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించేలా చూడాలని ఆదేశించారు. మురుగు కాల్వల పూడిక తీత పనులు నిర్దేశిత ప్రణాళిక (Schedule) ప్రకారం జరగాలని, ఎక్కడా నీరు నిలవకుండా చూడాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎం.హెచ్.ఓ డా.రాజేష్, ఈ.ఈ రవి కుమార్, డీఈలు రాజ్ కుమార్, రాగి శ్రీకాంత్, శానిటరీ సూపర్ వైజర్ నరేందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.






## వ్యవసాయంలో 'డ్రోన్' జోరు

- సాగులో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- రైతులకు డ్రోన్లను పంపిణీ చేసిన కలెక్టర్
- తక్కువ ఖర్చు..సమయం.. అధిక దిగుబడి లక్ష్యం
- నందనం రూరల్ మార్ట్ పనితీరుపై కలెక్టర్ ప్రశంసలు

**వరంగల్ వాయిస్, ఐనవోలు/హనుమకొండ :** సాంప్రదాయ వ్యవసాయానికి స్వస్తి చెప్పి, రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పిలుపునిచ్చారు. గురువారం ఐనవోలు మండల కేంద్రంలో నాబార్డ్ పథకం కింద వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతు సేవా సహకార సొసైటీ (నందనం)కి కేటాయించిన డ్రోన్లను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డ్రోన్ల వినియోగం వల్ల రైతులకు శ్రమ తగ్గడమే కాకుండా ఆర్థికంగానూ మేలు జరుగుతుందని పేర్కొన్నారు. డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగుమందులను తక్కువ సమయంలో, సమానంగా పిచికారీ చేయవచ్చు. దీనివల్ల మందుల వృథా తగ్గుతుంది. డ్రోన్ల నిర్వహణపై పైలెట్లకు ఇచ్చిన శిక్షణ, వాటి పనితీరు, ఒక డ్రోన్ ఎన్ని ఎకరాల్లో స్ప్రే చేయగలదనే వివరాలను 'వ్యోమిక్ డ్రోన్స్' ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. నందనం రైతు సేవా సహకార సొసైటీతో పాటు నర్సంపేట, నెల్లికుదురు పీఏసీఎస్ లకు అందజేస్తున్న డ్రోన్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్రోన్ల పంపిణీ అనంతరం నందనం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూరల్ మార్ట్ను కలెక్టర్ సందర్శించారు. మార్ట్ లో విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల వస్తువులను పరిశీలించి, నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. రూరల్ మార్ట్ నిర్వహణ అద్భుతంగా ఉందని, గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహించే ఇటువంటి కేంద్రాలను ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, వరంగల్ అధికారి చైతన్య, డీసీఓలు సంజీవరెడ్డి, నీరజ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ఏడీఏ ఆదిరెడ్డి, సహకార శాఖ అధికారి జగన్మోహన్ రావు, సర్పంచులు రఘు వంశీ, రాజు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు రాములు ఆశీర్వాదం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్వతగిరి మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జరిగిన పలు వివాహ శుభకార్యాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మండల కేంద్రంలోని గాయత్రీ ఫంక్షన్ హాల్లో జరిగిన రంగు కుమార్ కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండ హంటర్ రోడ్‌లోని టీవీఎస్ ఫంక్షన్ హాల్లో పర్వతగిరి మండల అభివృద్ధి అధికారి మాలోత్ శంకర్ నాయక్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.హాసన్‌పర్తి మండలం అర్వపల్లి గ్రామంలో వడ్లకొండ శ్రీనివాస్ కుమారుని వివాహానికి హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో మేడిశెట్టి రాములుతో పాటు వివిధ పార్టీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వాస్తవ లెక్కలతో సమగ్ర బడ్జెట్‌ను రూపొందించాలి

□ మేయర్ గుండు సుధారాణి

**వరంగల్ వాయిస్, బల్దియా :** నగర అభివృద్ధిని కాంక్షిస్తూ 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సమగ్ర సమాచారంతో, వాస్తవ గణాంకాల ఆధారంగా బడ్జెట్ రూపకల్పన చేయాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో హన్మకొండ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి వివిధ విభాగాల ఉన్నతాధికారులతో బడ్జెట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, బల్దియాలోని వివిధ విభాగాలు తమ ఆదాయ వ్యయాలను, భవిష్యత్తు అవసరాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు అందించాలన్నారు. బడ్జెట్ ఆమోదయోగ్యంగా ఉండేలా మార్పులు చేర్పులు ఉంటే వెంటనే కలెక్టర్/కమిషనర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అకౌంట్స్ విభాగం అధికారులు బల్దియా ఖర్చు చేస్తున్న విధానం మరియు కేటాయించాల్సిన ఆర్థిక అంశాలను మేయర్, కలెక్టర్లకు వివరించారు. ఈ సమావేశంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ జనార్ధన్, అకౌంట్స్ అధికారి శివలింగం, సీహెచ్ఓ రమేష్, సిటీ ప్లానర్ రవీందర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, సమ్మయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సరం డైరీ మరియు క్యాలెండర్‌ను మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బోట్ల భిక్షపతి మాదిగ, రమేష్, ఎల్పుల ధర్మరాజు, భాస్కర్, స్వామి, రామకృష్ణ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.




## కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌కు మేయర్ సన్మానం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్ ని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి, పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, చాహత్ బాజ్ పాయ్ గారు బల్దియా కమిషనర్‌గా సమర్థవంతమైన సేవలు అందిస్తూనే, ఇప్పుడు హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా నియామకం కావడం హర్షణీయమన్నారు. వారి పర్యవేక్షణలో జిల్లా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. నగర అభివృద్ధిలో జిల్లా యంత్రాంగం, కార్పొరేషన్ సమన్వయంతో ముందుకెళ్లాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ జనార్ధన్, సీహెచ్ఓ రమేష్, అకౌంట్స్ అధికారి శివలింగం, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, హెచ్ఓ లక్ష్మారెడ్డి, ఈఈ సంతోష్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com